క్లుప్తంగా

ధాన్యం దిగుబడులు ఆశాజనకం



అమరాం వద్ద దిగుబడి పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వరహాలురావు

రాజాం: రాజాం మండలంలో ఖరీఫ్ వరి ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నట్టు జిల్లా గణాంక అధికారి ఎం.వరహాలరావు వెల్లడించారు. మండలంలోని అమరాం, ఆగూరు, కంచరాం, గడిముడిదాం, దోసరి తదితర గ్రామాల్లో పంటకోత ప్రయోగాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మంలంలో తొమ్మిది యూనిట్లలో పంటకోత ప్రయోగాలు అయ్యాయని, ఎకరాకు 24 నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. ఆయన వెంట రాజాం ఏఎస్‌ఓ బాలమోహన్, టెక్నికల్ సిబ్బంది ఉన్నారు.

దిష్టిబొమ్మల్లా ఏటీఎంలు



చీపురుపల్లి రోడ్డులో పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం

రాజాం: పట్టణంలోని చీపురుపల్లి రోడ్డు, పాలకొండ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంలు నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. పలుచోట్ల ఈ ఏటీఎంలను సక్రమంగా నిర్వహించకపోవడంతో పనిచేయడం లేదు. ప్రతీ నెల వేల రూపాయల్లో అద్దెలు చెల్లిస్తున్నప్పటికీ స్థానిక ఎస్‌బీఐ అధికారులు మాత్రం వీటి నిర్వహణపై దృష్టి సారించకపోవడం, ఈ మిషన్లలో నగదు పెట్టకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ ఏటీఎంల్లో డబ్బులు విత్‌డ్రాలకు వెళ్లి డబ్బులు లేకపోవడంతో ఉసూరుమంటూ ఖాతాదారులు తిరుగుముఖం పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ ఏటీఎంలు వినియోగంలోకి తీసుకురావాలని ఖాతాదారులు కోరుతున్నారు.

రెల్లరాల్చు పురుగుతో అప్రమత్తంగా ఉండాలి



పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

రామభద్రపురం: వరి పంట కోత దశకు దశకు వచ్చే సమయంలో పంటను ఆశిస్తున్న రెల్లరాల్చు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు కొండలరావు, రామారావు అన్నారు. మండలంలో ఇంకా కోతలు కోయని పంట పొలాల వద్దకు వెళ్లి ఈ పురుగుపై రైతులకు అవగాహన కల్పించారు. తుఫాన్ ప్రభావం వల్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వేయిదా వేసుకోవాలని, నూర్పిడి చేసిన పంటను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. కోసిన పంటను కుప్పలు వేయాలన్నారు. చుట్టూ వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు.

దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రాజాం సిటీ: దివ్యాంగ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ యుగంధర్ అన్నారు. ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీలో భవిత కేంద్రం, దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్య తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను తక్కువ చేసి చూడకూడదన్నారు. జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, వైద్యాధికారులు యు.కిరణ్, అనూష, ఎ.నేతాజి, ఎస్.వసంతరావు, ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

- కొనుగోలు కేంద్రాలను తూచ్ అంటున్న అన్నదాత
- మద్దతు ధర కంటే తక్కువైనా దళారీలకే ధాన్యం విక్రయాలు
- వెలవెలబోతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు

దళారులకే.. ధాన్యపు రాశులు



పొలాల్లో బడిపెలు వేసి ఉన్న ధాన్యం

బొబ్బిలి రూరల్: గతంలో మాదిరి ఇప్పుడు రైతన్న జాలీల్లో డబ్బు కానరావడం లేదు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రైతుభరోసా ఇప్పుడు లేదు. పంట సాగుకు తెచ్చిన అప్పులతో ఆపసోపాలు పడుతున్న రైతులకు ధాన్యం వ్యాపారి దేవుడులా కనిపిస్తున్నాడు. ముందెన్నడూ లేనంత నాణ్యమైన గింజ, ఎన్నడూ లేనంతగా ఎకరానికి 55 – 60 బస్తాల దిగుబడి సాధించిన రైతుకు డబ్బెప్పుడు చేతికొస్తుందా.. అని ఎదురు చూస్తున్న రోజులు. ఇంతలోనే తుఫాన్ ప్రకటన రైతులను నిద్రలేని రాత్రులను గుర్తు చేస్తోంది. కారు మబ్బులకు జడుసుకుంటున్నాడు. ఇదే అదునుగా వ్యాపారులు, దళారీలు చేలో పడ్డారు. ఉన్నపళంగా అక్కడే బేరాలు పెడుతున్నారు. ఇదిగో డబ్బంటూ ఊరిస్తున్నాడు. ఉన్న పళంగా మిషన్‌తో అక్కడే నూర్పి అనుకున్న సొమ్మును అక్కడే చెల్లించేస్తుండడంతో రైతులు దళారీల వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. 48 గంటల్లోగా ధాన్యం సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామంటోంది. సంచులిస్తాం, ట్రాన్స్‌పోర్టు భరిస్తాం, జీపీఎస్ వాహనాలను అందుబాటులో పెడతాం, తేమ శాతం చూస్తాం ఇలా ఎన్నో వరాలు ప్రభుత్వం ప్రకటించినా ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు రైతాంగం అడుగులు పడడం లేదు. అధికారులు ఎన్ని చెప్పినా రైతులు పెడచెవినే పెడుతున్నారు. దీంతో దళారులు పెద్ద అవకాశంగా మలుచుకుంటున్నారు. క్వింటాకు ప్రభుత్వం రూ.2300లతో పాటు గన్నీబ్యాగు, ట్రాన్స్‌పోర్టు ఖర్చుల కింద మరో 50 రూపాయిలను అదనంగా చెల్లిస్తున్నా రైతులు అటుగా వెళ్లడంలేదు. రైతు భరోసాకేంద్రాలకు వెళ్లి, ఆధార్ కార్డు నమోదు చేయించి గన్నీ బ్యాగులను పోగేసుకుని పొలానికి వెళ్తున్న రైతు నూర్పు అయిన తరువాత మళ్లీ రైతు సేవాకేంద్రానికి వెళ్లి ట్రక్‌షీట్ తెచ్చుకుని అప్పుడు మిల్లుకు తరలిస్తే 48 గంటల్లోగా డబ్బు చెల్లిస్తోంది ప్రభుత్వం. ఇక్కడ దళారుల వద్ద ఆ పంచాయితీనే లేదు. నేరుగా దళారులు రైతుల పంట పొలాల్లోకి వెళ్లి అక్కడే యంత్రంతో నూర్పి క్వింటాకు రూ.1900 నుంచి 2100 వరకు చెల్లిస్తున్నాడు. గంటల్లో రైతు చేతికి డబ్బులొస్తున్నాయి. శుక్రవారం వరకు చినుకు జాడ లేకపోవడంతో తేమను దళారీలు పట్టించుకోవడం లేకుండానే కొనుగోలు చేస్తున్నారు. మిల్లుల వద్ద పడిగాపులు కాయాల్సిన అవసరం లేదంటూ దళారులనే రైతులు ఆశ్రయిస్తున్నారు.



రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఓ చోట చేర్చుతున్న ధాన్యం వ్యాపారులు



రైతులు రాక వెలవెలబోతున్న రైతుభరోసా కేంద్రం

● ధాన్యానికి డిమాండ్

తొలకరి సీజన్‌లో వరుస తుఫాన్లతో తూర్పు, పశ్చిగోదావరి జిల్లాలో పంట పొలాల్లో నీరు చేరడం, పండిన ధాన్యంలో తేమ శాతం పెరిగిపోవడంతో ఇక్కడి ధాన్యానికి గిరాకీ ఏర్పడింది. ఈ ఏడాది నాణ్యమైన ధాన్యం గింజ పండిందని, ఏదో ఓ రేటుకు ఇక్కడ ధాన్యం కొని అక్కడ విక్రయించేందుకు వ్యాపారులు దళారులను నియమించి ఇక్కడ పంట పొలాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.

బొబ్బిలి నియోజకవర్గంలో 24వేల 800 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని వరి పంటల కోతలు దాదాపు పూర్తయ్యాయి. ధాన్యం కొనుగోలుకు కేంద్రాలను ఈ వారంలోనే ప్రారంభించారు. అప్పటికే దాదాపు 10 శాతం వరకు రైతులు దళారీలకు ధాన్యాన్ని అమ్ముకున్నారు. శుక్రవారం వరకు పల్లెల్లో ఎక్కువ శాతం ధాన్యం దళారీల వసమైపోయింది. వర్షాలు కురుస్తాయన్న ప్రకటనతో ఏ రోజుకారోజు తమ పొలాల వద్దే బడిపెల వద్ద వచ్చిన దళారులకు పంటను అమ్మేస్తున్నారు. దీంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుందన్నది సందేహమే.

● శనివారం నుంచి తేమ కష్టాలు

కాగా శుక్రవారం నుంచి తుఫాన్ ప్రభావంతో అక్కడక్కడా చినుకులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావం లేదనుకున్న సమయంలో చినుకు పడడంతో బడెపెలు వేసిన ధాన్యంలో నీరు చేరే ప్రమాదం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఇక నుంచి రైతులకు దళారీల నుంచి తేమ ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం కూడా 17శాతం తేమ శాతం ఉన్నా కొనుగోలు చేస్తామంటున్నా ఈ వర్షాలకు ఎంతో కొంత ధాన్యం తడిచే ప్రమాదం లేకపోలేదు. తేమశాతం పెరిగే అవకాశం ఉండకపోదు. దీంతో అటు దళారులకు వచ్చిన అవకాశంగా భావించవచ్చని రైతాంగా భావిస్తోంది.

● 'భోజనం'లో తగ్గేదేలే...



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి శుచి, శుభ్రత పాటించాలని, నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. బాడంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం శుక్రవారం పరిశీలించారు. మెనూ పరిశీలించారు. వంటకాల రుచి చూశారు. పాఠశాలలో 454 మంది పిల్లలకుగాను 396 మంది హాజరైనట్టు గుర్తించారు. టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ 2 రాజేశ్వరి, ఎంపీటీసీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు. – బాడంగి

● శివస్వాముల తిరువీధి



కార్తీకమాసం పురస్కరించుకొని రామభద్రపురం మండల కేంద్రంలో గిరిజా రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం శివ మాలాధారణ ధరించిన శివస్వాములు అంగరంగ వైభవంగా పాలాభిషేకం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన శివ మాలాధారణ చేసిన వారంతా వేకువజామున పుణ్యస్నానాలు చేసి పాల కావిళ్లు పట్టుకుని శివుని ఉత్సవ విగ్రహం మొస్తూ పాలకావిళ్లతో తిరువీధి నిర్వహించారు. అన్ని వీధుల్లో భక్తులు కావిళ్లలో వేసిన పాలను తెచ్చి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేశారు. – రామభద్రపురం

● రైస్ మిల్లుల్లో రికార్డుల తనిఖీ



ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, రైస్‌మిల్లర్లు తగు చర్యలు చేపట్టాలని బొబ్బిలి ఆర్‌డీఓ రామ్మోహనరావు అన్నారు. తెర్లాంలోని రైస్ మిల్లులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఎంత మొత్తం ధాన్యం సేకరించారు.. తదితర వివరాలను తెలుసుకున్నారు. రైతులు మిల్లులకు ధాన్యం తెచ్చేటప్పుడు వెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం సేకరించినా.. ట్రక్‌షీట్‌ల కంటే అధికంగా ధాన్యం నిల్వలు ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్, సీఎస్‌డీటీ స్వర్ణలత, ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. – తెర్లాం

ఉల్లి కాడలు కిలో 100

- ఉల్లి ధరకు రెండింతలు ఎక్కువ

రామభద్రపురం: రామభద్రపురం అంతరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో ఉల్లి కాడల ధర కిలో రూ.100లు పలుకుతోంది. ఉల్లి ధర రూ.50 ఉంది. ఉల్లి కాడలు ధర ఉల్లి ధర కంటే మరింత ఎక్కువగా ఉంది. ఒకప్పుడు ఉల్లి రైతులుగాని, వినియోగదారులుగాని ఉల్లి కాడలను పెద్దగా పట్టించుకునేవారు కాదు. రైతులు చుట్టు పక్కల ఉన్న కుటుంబాల వారికి ఉచితంగా పంచేవారు. కొద్ది రోజులు తర్వాత చాలా స్వల్ప ధరలకు వినియోగ దారులు కొనుగోలు చేసేవారు. కాలక్రమంలో నాటు ఉల్లికి వినియోగదారుల్లో ఆదరణ పెరగింది. దీంతో పాటే ఉల్లికాడలను కూడా స్వల్ప ధరలకు కొనుగోలు చేసిన వినియోగడదారులు పెద్దగా పట్టించుకోని వాటి ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో విస్తుపోతున్నారు. నేడు ఈ ఉల్లికాడల ధరలు ఉల్లి పాయలతో పోల్చుకుంటే మరింత ఎక్కువగా వెళ్తున్నాయి. గతేడాది నుంచి ఉల్లి కాడల ధరలు బాగా పెరిగిపోయాయి. గతేడాది కంటే ఈ ఏడాది ధరలు మరింత లాభదాయకంగా ఉన్నాయని ఉల్లి రైతులు చెబుతున్నారు.



రామభద్రపురం మార్కెట్లో ఉల్లి కాడలు

సహస్ర పారాయణం



రాజాం సిటీ: పట్టణ పరిధి వాసవీనగర్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం సహస్ర పారాయణ కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు.

పన్ను చెల్లించకుంటే కనెక్షన్ కట్

రాజాం సిటీ: మున్సిపాల్టీలో బకాయిలు అధికంగా ఉన్న కుళాయి పన్నులు చెల్లించకుంటే నీటి సరఫరా నిలుపుదల చేయనున్నామని కమిషనర్ జె.రామప్పలనాయుడు హెచ్చరించారు. శుక్రవారం పట్టణ పరిధి కొండంపేటలో అధిక బకాయిలు ఉన్న కుళాయి కనెక్షన్లు సిబ్బందిచే కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పన్నుల బకాయిలు వెంటనే చెల్లించాలని సూచించారు.



కుళాయి కనెక్షన్ కట్ చేస్తున్న సిబ్బంది

తుఫాన్‌తో అప్రమత్తమైన రైతాంగం

రేగిడి: తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పంట పొలాల్లో వరి చేను కుప్పలు పెట్టారు. కొన్నిచోట్ల టార్పాలిన్లు వేసి ధాన్యాన్ని కాపాడే చర్యలు చేపట్టారు.

రైతులు అప్రమత్తం

వంగర: మండలంలోని రైతులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ నేపథ్యంలో ఇప్పటికే వరిపంటను భద్రపరుచుకోవాలని అధికారులు రైతులను చైతన్యం చేశారు. చాలా గ్రామాల్లో వరి పంటను నూర్పిడి చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించగా, మరి కొన్ని గ్రామాల్లో పంటను కుప్పలుగా వేసుకొని భద్రపరిచారు.

బొబ్బిలి: తుఫాను ప్రభావంతో తేలికపాటి వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ పక్క నూర్పిడి, మరో వైపు బస్తాలను భద్రపరచడంలో బిజీ బిజీగా గడుపుతున్నారు. కంటిమీద కునుకు లేకుండా వరి పంటను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి వర్షాలు కురవడంతో ధాన్యం తడిచిపోతుందన్న ఆందోళనలో రైతులున్నారు. డివిజన్‌లోని నాలుగు మండలాల్లోని రైతులు వరి పంట ఉత్పత్తులను కళ్లాల్లో టార్పాలిన్‌లు కప్పి భద్రపరుస్తున్నారు.



వంగర: కొప్పర వద్ద వరి పంట కుప్పలు

సంతకవిటిలో..

సంతకవిటి: మండలంలో తుఫాన్ ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోసిన వరి పంటను పొలాల్లోనే చిన్న కుప్పలుగా ఏర్పాటు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

బొబ్బిలి: బాడంగి మండలం ఆనవరం గ్రామానికి చెందిన మరడ నవీన్ 70 మద్యం సీసాలు తరలిస్తుండగా సీఐ సతీష్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. బొబ్బిలి మండలం పిరిడి, కారాడ మీదుగా ఆనవరం వెళ్తుండగా చెరువు గట్టుపై అరెస్టు చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రామభద్రపురం: ప్రభుత్వం విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మండల విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చింతల చిన్నమ్మతల్లి డిమాండు చేశారు. మండల కేంద్రంలోని శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయ సంఘ సభ్యులంతా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నమ్మతల్లి మాట్లాడుతూ ప్రభుత్వం కరువు భత్యం, పే రివిజన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. అలాగే అన్ని రకాల వ్యాధులకు ఈహెచ్‌ఎస్ అమలు చేయాలన్నారు. కనీస పాత శ్లాబులను 10 శాతం నుంచి 15 శాతానికి పెంచి విడుదల చేయాలన్నారు. బకాయి ఉన్న ఐఆర్ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్ రామకృష్ణ, గుల్లిపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

బొబ్బిలి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా తాపీ పనివారల సంఘం కార్యాలయంలో సావనీర్‌ను శుక్రవారం విడుదల చేశారు. రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రౌతు రామమూర్తి నాయుడు చేతుల మీదుగా సావనీర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను రైతులు పోరాడి రద్దు చేసుకున్నప్పటికీ వాటిని దొడ్డిదారిన అమలు పర్చేదిశగా పావులు కదుపుతున్నారన్నారు. రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామన్న హామీని గాలికి వదిలేశారన్నారు. న్యాయవాది కండాపు ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటీకరణలు జోరందుకున్న ఈ సమయంలో అన్ని సంఘాలూ ఒకేతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు.

సంక్షిప్తంగా...

నేడు బడ్జెట్ సమావేశం

బాడంగి: మండల బడ్జెట్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు. అలాగే సామాజిక భరోసా పింఛన్లు లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెలకుగాను 8,813 మంది పింఛన్‌దారులకు రూ.3కోట్ల 41 లక్షల వరకు సచివాలయ సిబ్బందితో నగదు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తెర్లాం: రాష్ట్ర స్థాయిలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఇటీవల చిత్తూరులో నిర్వహించారు. పోటీల్లో జిల్లా బాలికలు, బాలుర జట్టులో పాఠశాలకు చెందిన సీహెచ్ గౌతమ్, జి.లిఖిత, సీహెచ్ బాలకృష్ణ మంచి ప్రతిభను కనబరిచారు. క్రీడాకారులు ఆటలతో పాటు, చదువులోను బాగా రాణించాలని కోరారు.

హౌస్‌హోల్డ్ సర్వే పరిశీలన

రాజాం: మండలంలో కంచరాం, గురవాం తదితర గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది చేస్తున్న హౌస్‌హోల్డ్ సర్వేను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. సర్వే పక్కాగా చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ప్రతీ ఇంటి వద్ద ఐఎస్ఎల్ ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

అపార్ వేగవంతం చేయండి

రాజాం: అపార్ నమోదు వేగవంతం కావాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ఎంఈఓ బి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాలల్లో అపార్ నమోదును పరిశీలించారు. విద్యార్థుల వివరాలు సక్రమంగా ఉండేలా చూడాలని, ఎటువంటి దోషాలు ఉన్నా భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని, అటువంటివి రాకుండా చూసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు తనిఖీలు

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర బాలల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌ఏ)లో భాగంగా విద్యార్థులకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఎత్తు, బరువులను పరిశీలించారు. హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, ఏఎన్‌ఎం బి.విశాలాక్షి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వంగర: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ షేక్ శంకర్ అన్నారు. మండల పరిధి మద్దువలస జంక్షన్ వద్ద సంకల్పం కార్యక్రమంపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితం నాశనం అవుతుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తేమశాతం ఆధారంగానే ధాన్యానికి ధర

రేగిడి: రైతులు పండించిన ధాన్యాన్ని టెక్నికల్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. శుక్రవారం మండలంలోని ఆడవరం, లక్ష్మీపురం, కొమిర, రేగిడి తదితర గ్రామాల్లో ధాన్యం తేమశాతం పరిశీలించారు. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం ఏ విధంగా ఉందన్నది తెలుసుకుంటున్నారు. తేమ శాతం ఆధారంగానే ధాన్యం ధర ఉంటుందని ఏఓ మురళీకృష్ణ అన్నారు. పక్కాగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు అధికారులు భరోసా ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్ సెంటర్(పోలవానివలస)ప్రాంతంలో ఆటో, వ్యాన్ పరస్పరం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. బంగారమ్మపేటకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఆటోపై చినభోగిలి వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. గున్నతోటవలస వెళ్తున్న వ్యాను ఈ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నల్ల విజయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో బొబ్బిలి సీహెచ్‌సీ నుంచి విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించారు. అతని భార్య నల్ల అనితకు స్వల్ప గాయాలయ్యాయి. సీఐ కె.సతీష్‌కుమార్ ఆదేశాలతో ఏఎస్ఐ జి.భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ ఎదురుగా ఉన్న తోటలో పేకాడుతున్న వారిపై సీఐ కె.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్ సిబ్బంది దాడి నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9,090లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

బెల్లం ఊట ధ్వంసం

రామభద్రపురం: మండలంలోని కరిందొరవలస గ్రామ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు చేశారు. ఈ క్రమంలో 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా అక్రమంగా తయారు చేస్తే ఆయా నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. విజయనగరం ఈఎస్‌టిఎఫ్ ఎస్ఐ జి.గంగాధర్, సీతానగరం ఎక్సైజ్ ఎస్ఐ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.